RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం



CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 278 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 03-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 278 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 03-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## సింగపూర్ పర్యటనకు

# ఏపీ బెస్ట్ టీచర్లు...

మంత్రి నారా లోకేష్ స్పందన

శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం

ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ


ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్



తరువాయి 2లో..

# హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- గత కొంతకాలంగా పవన్‌కు అనారోగ్య సమస్యలు
- ఇటీవలే హైదరాబాద్‌లో శస్త్రచికిత్స
- హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు
- శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన
- తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్



తరువాయి 2లో..

వాట్సాప్ వేదికగా వైద్య సేవలు

# ఏపీ ప్రభుత్వ సరికొత్త అడుగు

మనమిత్ర సేవలను అందుబాటులోకి తెచ్చిన ఏపీ ప్రభుత్వం

డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా కీలక నిర్ణయం

వాట్సాప్ ద్వారా వైద్య సేవలను, సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రజలకు, వైద్యులకు ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా... ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్

తరువాయి 2లో..





**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కాల్పుల విరమణ కొనసాగుతోన్నప్పటికీ.. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. అమెరికాతో సంఘర్షణపై ఇరాన్ సైనికాధికారి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. యూఎస్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశం ఉందని తెలిపారు. శాంతి చర్చలపై ఇరాన్-అమెరికా మధ్య అనిశ్చితి నెలకొంది. ఒప్పందం కోసం ఇరాన్ తాజాగా పంపిన ప్రతిపాదనపై యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈక్రమంలో ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయ డిప్యూటీ అధికారి మహమ్మద్ జాఫర్ అసదీ మాట్లాడుతూ.. అమెరికా ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని ఆరోపించారు. అమెరికా అధికారుల ప్రకటనలు గందరగోళంగా ఉన్నాయని విమర్శించారు. ఈ క్రమంలో అమెరికా- ఇజ్రాయెల్ మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. శత్రు దేశాలు చేసే ఎలాంటి దాడులనైనా ఎదుర్కొనేందుకు తమ

తరువాయి 2లో..

# గ్రామాల్లో నేత్ర వైద్య సేవలు అభినందనీయం

గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**గుడివాడ, సిటిజన్ టైమ్స్**

లాభాపేక్ష లేకుండా ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో నేత్రవైద్య సేవలు అందిస్తున్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గుడ్లవల్లేరు లాంటి గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని పెంజంద్ర రోడ్డులో జాస్తి

తరువాయి 2లో..

# జీవన్ నాయుడు పార్థివదేహానికి చంద్రబాబు, లోకేశ్ నివాళి

యానాం రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు కన్నుమూత

హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన చంద్రబాబు, లోకేశ్

నాయుడుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న చంద్రబాబు





**అమరావతి, సిటిజన్ టైమ్స్**

యానాం రీజెన్సీ గ్రూప్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ జీఎన్ నాయుడు అనారోగ్యంతో కన్నుమూశారు. ఈరోజు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారా లోకేశ్.. నాయుడు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జీఎన్

తరువాయి 2లో..

# వరంగల్‌కు మహర్దశ..

మే 10న కాకతీయ మెగా పార్క్‌ను ప్రారంభించనున్న ప్రధాని

ఈ నెల 10న వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభం

హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులు.. 24,400 మందికి ఉపాధి అంచనా

1,327 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిర్మాణం

'ఫామ్ టు ఫారెన్' (5ఫీ) లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన



**వరంగల్, సిటిజన్ టైమ్స్**

తెలంగాణలోని వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఈ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇవాళ సోషల్ మీడియా

తరువాయి 2లో..

# 2028 నాటికి అమరావతిలో బసవతారకం ఆసుపత్రి

నిర్మాణ పనులను ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ

**తుళ్లూరు, సిటిజన్ టైమ్స్**

తన తల్లి బసవతారకం పేరుపై ఏర్పాటుచేస్తున్న క్యాన్సర్ ఆసుపత్రుల ద్వారా పేద, ధనిక తేడా లేకుండా అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తామని బసవతారకం ఇండో



తరువాయి 2లో..

# ఏప్రిల్‌లో ఏపీ ఖజానాకు పన్నుల పంట.. రూ. 5,543 కోట్ల రికార్డ్ వసూళ్లు

ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో రూ.5,543 కోట్ల పన్నుల వసూళ్లు

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే అత్యధిక నెలవారీ ఆదాయం

గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 12.08 శాతం వృద్ధి నమోదు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో పన్నుల వసూళ్లు సరికొత్త రికార్డు సృష్టించాయి. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర ఖజానాకు ఏకంగా రూ. 5,542.7 కోట్ల ఆదాయం

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

## నో చాన్స్ అంటున్న బాబు...

# ఎమ్మెల్యేలు అలెర్ట్ !

తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేల పనితీరు మీద వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తారు. దానికి తోడు ఇపుడు నేరుగా ప్రజల నుంచి సమాచారం తీసుకుంటాను అంటున్నారు. దాంతో టీడీపీ ఎమ్మెల్యేలు ఫుల్ అలెర్ట్ కావాల్సిందే అన్న మాట వినిపిస్తోంది. నిజం చెప్పాలీ అంటే బాబు తన పార్టీ ఎమ్మెల్యేలకు నేరుగానే వార్నింగ్ ఇచ్చేశారు. అది తన పార్టీ ఎమ్మెల్యేలకు చెప్పాల్సిన సూటిగానే చెప్పేశారు చంద్రబాబు ఇంతకీ ఏం చెప్పారంటే ఎమ్మెల్యే పనితీరు మార్చుకోవాల్సిందే అన్నది ఎవరైనా ఎమ్మెల్యే తన పనితీరు మార్చుకోకపోతే చేసేదే ఉండదన్న సందేశాన్ని బాబు పంపించారు. కృష్ణా జిల్లా పమిడి ముక్కలలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే ముఖా ముఖీ అడుగుతానని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే జవాబులే ఎమ్మెల్యేల పనితీరుకు అచ్చమైన నిదర్శనమని భావిస్తాను అన్నారు. ప్రజల్లో ఉన్నవాళ్ళకి పనితీరు మెరుగుపరుచుకున్న వాళ్ళకి పార్టీలో అవకాశాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు ఒకవేళ ఎమ్మెల్యేల పనితీరు సరిగ్గా లేకుంటే వారికి ఇంకొక ఛాన్స్ ఉండదని చంద్రబాబు ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. దీంతో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఏర్పడింది. అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేల పనితీరు మీద పూర్తి ఫోకస్ పెట్టినట్టుగా అర్థమవుతుంది. ఏ పార్టీకైనా ప్రభుత్వానికైనా ఎమ్మెల్యేల పనితీరే కొలమానంగా ఉంటుంది ఎవరైనా ఎక్కడైనా తప్పు చేస్తే అది కచ్చితంగా పార్టీ మీద ప్రభావం చూపిస్తుంది. అందుకే చంద్రబాబు ఈ విషయంలో చెప్పాల్సింది చెప్పేశారు. నో ఛాన్స్ అని కూడా చెప్పేశారు. దాంతో ఇది ఒక కఠిన సందేశంగా టీడీపీ ఎమ్మెల్యేలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిజానికి ప్రజలలో నిత్యం ఉన్నవాళ్ళకి ఏ రకమైన ఇబ్బందులు ఉండవు అంతే కాదు వారి విషయంలో ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు ఉండవు. అందువల్ల అటువంటి ఎమ్మెల్యేలు బేఫికర్ గా ఉండవచ్చు. కానీ ప్రజలతో సంబంధాలను మెరుగుపరుచుకోలేని వాళ్ళు, జనంతో మమేకం కాని వాళ్ళు, కార్యకర్తలతో కలిసి రాని వాళు ళ్ళ చంద్రబాబు హెచ్చరికలను ఇకమీదట పట్టించుకోవాల్సిన అవసరం అయితే ఉందని అంటున్నారు. లేకపోతే బాబు చెప్పినట్టుగా వాళ్లకి నో ఛాన్స్ అన్నది ఖాయం. ఇక చూస్తే రాజకీయాలలో అవకాశాలున్నవి ఎవరో ఇవ్వరు. ఎవరి మటుకు వారే తమ పనితీరుతో ప్రతిభతో సంపాదించుకోవాల్సిన అవసరం ఉంది ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ స్పష్టమైన వైకరితో ఉన్ది. చంద్రబాబు గురించే మాట్లాడుకుంటే ఆయన ఎప్పటికప్పుడు పార్టీ ఎమ్మెల్యేలను కానీ మంత్రులను కానీ అలెక్ట్ చేస్తూనే ఉన్నారు. వారికి దిసా నిర్దేశం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చెప్పిన మాటలను పట్టించుకోని మారిన వారికి పార్టీలో ఏ రకమైన అవకాశాలు ఉండవని టాయని తేటతెల్లమైంది. చంద్రబాబు అధినేత హోదాలో చాలా పక్కాగా ఉంటారు. పార్టీ విషయంలో చాలా స్పష్టంగా ఉంటారు. గతంతో పోలిస్తే ఇపుడు మరింత కఠినంగానే ఉంటూ వస్తున్నారు. గతంలో సంగతి ఏమో కానీ ప్రస్తుతం చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేల పనితీరు విషయంలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నారు. బహిరంగ వేదికలయితేనేమి పార్టీ సమావేశాల్లో అయితేనేమి బాబు కచ్చితంగా వ్యవహరిస్తున్నారు. ఇక తన చేతులలో ఏమీ లేదని చెప్తున్నారు. అందువల్ల మారాల్సింది పార్టీ ఎమ్మెల్యేలు మాత్రమే. చంద్రబాబు మాటలను హెచ్చరికలను ఇప్పటికైనా పాటిస్తే మరొక ఛాన్స్ ఎవరికైనా దక్కుతుంది అన్నది స్పష్టం.

## జీఎన్ నాయుడు పార్థివదేహానికి చంద్రబాబు, లోకేశ్ నివాళి

నాయుడుతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. రీజెన్సీ సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన అగ్రగామిగా నిలిచారని సీఎం కొనియాడారు. నాయుడు మరణం పారిశ్రామిక రంగానికి తీరని లోటని, ఆయన రూపంలో తెలుగు ప్రజలు ఒక గొప్ప పారిశ్రామికవేత్తను కోల్పోయారని చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు.

# వరంగల్‌కు మహర్దశ..

ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి సమీకృత టెక్స్‌టైల్ హబ్‌గా ఈ పార్కును తీర్చిదిద్దినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పార్కు ద్వారా టెక్స్‌టైల్ తయారీ, ఉపాధి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ '5ఖీ' (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారెన్) దార్శనికతకు అనుగుణంగా టెక్స్‌టైల్ విలువ గొలుసును బలోపేతం చేసేందుకు ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు వివరించారు. దాదాపు 1,327 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,695.54 కోట్లు కాగా, దీని ద్వారా రూ. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు ఖరారైనట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్కులోని 62 శాతం స్థలాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ మెగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత 24,400 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దాదాపు 2,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు పూర్తయ్యాయని, 232 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 12 మీణ నీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థ జల శుద్ధి ప్లాంటు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్‌తో పాటు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు.

## 2028 నాటికి అమరావతిలో

# బసవతారకం ఆసుపత్రి

అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తుళ్లూరు, అనంతవరం మధ్య ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భూమిపూజ చేశారు. బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. 'అమరావతిలో ప్రభుత్వం కేటాయించిన 21 ఎకరాల్లో.. జీ౦9 అంతస్తులతో ఆసుపత్రి భవన నిర్మాణం చేపడతాం. 2028 నాటికి సుమారు రూ.700 కోట్లతో 500 పడకల సామర్థ్యంతో మొదటిదశ పూర్తిచేస్తాం. హైదరాబాద్‌లో బసవతారకం ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని జూన్ 22న భారీ కార్యక్రమం నిర్వహించబోతున్నాం. నాకున్న పెద్దఆస్తి నా అభిమానులే. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రి నిర్మాణానికి తొలిగా నా అభిమాని కర్నూలుకు చెందిన మోతీలాల్ రూ.10వేల విరాళం అందించారు. మరో 20 ఏళ్లు నా నటజీవితాన్ని కొనసాగిస్తా' అని వెల్లడించారు. 'చంద్రబాబు సారథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి నిర్మాణం కొనసాగుతోంది. ఇది ఆంధ్రులకు గర్వకారణం' అన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఆసుపత్రి మెంబర్ జేఎస్‌ఆర్ ప్రసాద్, రావి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొర్రా రామకృష్ణ, అమరావతి ఐకాస కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో ఏపీ ఖజానాకు పన్నుల పంట..

# రూ. 5,543 కోట్ల రికార్డ్ వసూళ్లు

సమకూరింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. గతేడాది ఏప్రిల్‌లో వసూలైన రూ. 4,946 కోట్లతో పోలిస్తే ఇది 12.08 శాతం అధికం కావడం గమనార్హం. ఈ గణనీయమైన వృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే కీలక కారణమని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డేటా విశ్లేషణ, యూపీఐ లావాదేవీల పర్యవేక్షణ, డిస్కమ్‌ల డేటాతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ల ధ్రువీకరణ వంటి సంస్కరణలు సత్ఫలితాలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. పన్నుల లీకేజీని అరికట్టి, పన్ను పరిధిని విస్తరించడంలో ఈ విధానాలు ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. విభాగాల వారీగా చూస్తే... నికర జీఎస్టీ వసూళ్లు 6.83 శాతం వృద్ధితో రూ. 3,796.91 కోట్లకు చేరాయి. పెట్రోలియంపై వ్యాట్ వసూళ్లలో ఏకంగా 26.72 శాతం వృద్ధి నమోదై, రూ. 1,613.36 కోట్లుగా ఉంది. ఇక వృత్తి పన్ను ద్వారా రూ. 42.9 కోట్లు సమకూరాయి. మొత్తం మీద గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి రూ. 598 కోట్ల అదనపు ఆదాయం ప్రభుత్వానికి లభించింది.

# అరెస్టు, కస్టడీల మధ్య వున్నా తేడా ఏమిటి..?




సమాజంలో నేర నియంత్రణకు పోలీసులు తీసుకునే చర్యల్లో "అరెస్టు" మరియు "కస్టడీ" అనే పదాలు తరచుగా వినిపిస్తాయి. కానీ చాలా మందికి ఈ రెండింటి మధ్య తేడా స్పష్టంగా తెలియదు. ఈ అవగాహన లోపం వల్ల అపోహలు, భయాలు పెరుగుతుంటాయి. అందుకే ప్రతి పౌరుడు ఈ ప్రాథమిక న్యాయ అంశాలను తెలుసుకోవడం అత్యంత అవసరం.

**అరెస్టు అంటే ఏమిటి?**

భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్ ) సెక్షన్ 35, 36, 37 ప్రకారం, అరెస్టు అనేది ఒక వ్యక్తి యొక్క శారీరక స్వేచ్ఛను చట్టబద్ధంగా పరిమితం చేయడం. పోలీసులు లేదా అధికారం కలిగిన వ్యక్తి, న్యాయపరమైన కారణాలతో, అనుమానం ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం అరెస్టు. అరెస్టు అనేది శిక్ష కాదు, ఇది కేవలం విచారణలో భాగం మాత్రమే. ఉదాహరణకు, ఒక నేరం జరిగినప్పుడు అనుమానితుడిని పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపడతారు.

**కస్టడీ అంటే ఏమిటి?**

భారతీయ నాగరిక సురక్ష సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్) ప్రకారం, కస్టడీ అనేది అరెస్టు చేసిన వ్యక్తిని విచారణ కోసం నిర్దిష్ట కాలం పాటు అదుపులో ఉంచడం. ఇది రెండు ప్రధాన రకాలుగా ఉంటుంది.

1.పోలీస్ కస్టడీ

పోలీసులు కోర్టు అనుమతితో, విచారణ కోసం వ్యక్తిని తమ అదుపులో ఉంచడం పోలీస్ కస్టడీ. ఇది సాధారణంగా 14 రోజులకు మించదు. ఈ సమయంలో పోలీసులు విచారణ, ప్రశ్నించడం వంటి చర్యలు తీసుకుంటారు.

2.జ్యుడీషియల్ కస్టడి

కోర్టు ఆదేశాలతో, వ్యక్తిని జైలులో ఉంచడం జ్యుడీషియల్ కస్టడీ. ఇది పోలీస్ కస్టడీ కంటే భిన్నం ఇక్కడ వ్యక్తి జైలు అధికారుల అదుపులో ఉంటాడు, పోలీసులు కాదు. కేసు తీవ్రతను బట్టి ఇది 30, 60 లేదా 90 రోజులు వరకు ఉండొచ్చు. ఒక దొంగతనం జరిగిందని అనుకోండి. పోలీసులు అనుమానితుడిని అరెస్టు చేస్తారు. తర్వాత విచారణ కోసం కోర్టు అనుమతితో అతన్ని కొన్ని రోజులు పోలీస్ కస్టడీలో ఉంచుతారు. విచారణ కొనసాగుతున్నప్పుడు, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి, అంటే జైలుకు పంపిస్తుంది. అరెస్టు అనేది శిక్ష కాదు, అది విచారణ కోసం ఉపయోగించే ఒక సాధనం మాత్రమే. కస్టడీ కూడా విచారణను సజావుగా కొనసాగించడానికి తీసుకునే చర్య మత్రమే నని చెప్పవచ్చు. ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, భద్రత హక్కులు రాజ్యాంగం కల్పించింది. చట్టబద్ధమైన కారణం లేకుండా ఎవరినీ అరెస్టు చేయకూడదు. అలాగే అరెస్టు చేసిన వ్యక్తికి న్యాయ సహాయం పొందే హక్కు, తన కుటుంబానికి సమాచారం ఇవ్వించుకునే హక్కు వంటి ప్రాథమిక హక్కులు ఉన్నాయి. న్యాయ వ్యవస్థలో "అరెస్టు" మరియు "కస్టడీ" అనేవి శిక్షలు కాదు, నిజాన్ని బయటపెట్టే ప్రక్రియలో భాగాలు మాత్రమే. ఈ విషయంపై ప్రజల్లో సరైన అవగాహన పెరగడం వల్ల, న్యాయంపై నమ్మకం బలపడుతుంది మరియు అనవసర భయాలు తగ్గుతాయి అని ఈ సందర్భంగా చెప్పవచ్చు.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

## మొదటి పేజీ తరువాయి

## సింగపూర్ పర్యటనకు

# ఏపీ బెస్ట్ టీచర్లు...

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. "ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామాల్లో నేత్ర వైద్య సేవలు అభినందనీయం

సుబ్బారావు, పోలవరపు సత్యనారాయణ మెమోరియల్ ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ ఐకేర్ సెంటర్‌ను ఆయన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ జీఎన్ రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ ఛైర్మన్ జాస్తి వెంకట్ ఈ ఐకేర్ సెంటర్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం 4 లక్షల క్యాటరాక్ట్ సర్జరీలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ఐకేర్ సెంటర్‌లో చంద్రబాబు నేత్రవైద్య పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ సైనికాధికారి కీలక వ్యాఖ్యలు

సాయుధ దళాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయన్నారు.

**ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది: అమెరికా హెచ్చరికలు**

చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ టోల్ వసూలుచేస్తున్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై తాజాగా యూఎస్ ట్రెజరీ శాఖ కీలక హెచ్చరికలు చేసింది. ఇరాన్ విధించే టోల్ చెల్లిస్తే ఆయా షిప్పింగ్ సంస్థలు తమ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. టోల్ చెల్లింపులతో సహా ఇరాన్ సైన్యానికి మద్దతిచ్చే వారిపై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేసింది.

## ఏపీ ప్రభుత్వ సరికొత్త అడుగు

మెడికల్ కౌన్సిల్ సేవలను 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రజలు మరియు వైద్యులు తమ మొబైల్ నుంచి 9552300009 వాట్సాప్ నంబర్‌కు "హాయ్" లేదా "ఎఱ" అని మెసేజ్ పంపి.. తదనంతరం వచ్చే మెనూలో 'ఆరోగ్య శాఖ' ఆప్షన్‌ను ఎంచుకుని ఈ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సరికొత్త విధానం ద్వారా వైద్యులు తమ రిజిస్ట్రేషన్ వివరాలు, దరఖాస్తుల స్థితిగతులు, రాబోయే సీఎమ్ఈ (జవీజు) కార్యక్రమాలు, క్రెడిట్ పాయింట్ల సమాచారాన్ని అరచేతిలోనే తెలుసుకోవచ్చు. అలాగే, సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఓపీ సేవలు, బ్లడ్ బ్యాంక్ లలో రక్త లభ్యతతో పాటు ఆసుపత్రులలో మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందో లేదో ఇట్టే ఆరా తీయవచ్చు. వైద్యులకు, రోగులకు ఒకే వేదికపై అత్యవసర సమాచారాన్ని అందిస్తూ, పౌరసేవలను మరింత చేరువ చేసే దిశగా ఏపీ ప్రభుత్వం వేసిన ఈ అడుగు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# నేతల అహంకారం హద్దులు దాటింది

## విశాఖ స్టీల్, పోర్ట్‌పై కన్నేసిన కార్పొరేట్లు : ఏ.బీ. వెంకటేశ్వరరావు





**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మే :02**

విశాఖలో "తెలుగు శక్తి" ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమధనం కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. హోటల్ మేఘాలయలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ విశ్రాంత అధికారి ఏ.బీ. వెంకటేశ్వరరావు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో నందమూరి తారక రామారావు ప్రజలనే దేవుళ్లుగా భావించారని, అయితే ఇప్పుడు రాజకీయ నాయకులు తమను తామే దేవుళ్లుగా భావిస్తూ ప్రజలను భక్తులుగా చూస్తున్నారని విమర్శించారు. ప్రజలే చప్పట్లు కొట్టే పరిస్థితిని సృష్టిస్తున్నారని అన్నారు. విశాఖ నగరాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలపైనే ఉందని స్పష్టం చేశారు. అదానీ, జిందాల్ వంటి పెద్ద సంస్థల ప్రభావం నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్ట్ ట్రస్ట్‌ను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అదానీ-గూగుల్ డేటా సెంటర్ వల్ల కేవలం 500 ఉద్యోగాలే వస్తాయని, అయితే ప్రజలపై భారం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. విశాఖ నగరాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలపైనే ఉందని స్పష్టం చేశారు. అదానీ, జిందాల్ వంటి పెద్ద సంస్థల ప్రభావం నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్ట్ ట్రస్ట్‌ను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అదానీ-గూగుల్ డేటా సెంటర్ వల్ల కేవలం 500 ఉద్యోగాలే వస్తాయని, అయితే ప్రజలపై భారం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు రూ.10,000 కోట్లు కేటాయిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. భూములను తక్కువ ధరకు కేటాయించడం తప్పు కాదని, కానీ ప్రతి ఎకరాకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో ముందుగానే స్పష్టత తీసుకోవాలని సూచించారు. రుషికొండలో రూ.500 కోట్లతో నిర్మించిన భవనాన్ని ఖాళీగా ఉంచడం సరికాదని విమర్శించారు. దాన్ని కనీసం కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ వార్డుగా లేదా ఐటీ కంపెనీలకు ఉపయోగించేలా చేయాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కుల ప్రాతిపదికన వీసీల నియామకం సరికాదని, ప్రతిభావంతులను ఎంపిక చేయాలని సూచించారు. ఆస్తి పన్ను 15% పెంపు వల్ల మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని అన్నారు. కార్మిక నాయకుడు అప్పలరాజుపై పీడీ చట్టం ప్రయోగం అప్రజాస్వామికమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమ నిర్వాహకుడు, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ మాట్లాడుతూ, వెంకటేశ్వరరావుతో తనకు ఎలాంటి వ్యక్తిగత పరిచయం లేకపోయినా ప్రజా సమస్యలపై స్పందించేందుకు వెంటనే అంగీకరించి కార్యక్రమానికి హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ ప్రొఫెసర్ పెంటకోట త్రినాధరావు, ఎం. కృష్ణమూర్తి, ఆడారి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాన్ షాప్‌లో గుట్టుగా మద్యం విక్రయం - వ్యక్తి అరెస్ట్



**పెందుర్తి, సిటిజన్ టైమ్స్,మే :02**

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సత్తివానిపాలెం ప్రాంతంలో నిర్వహించిన దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు, నమ్మదగిన సమాచారంతో పోలీసులు సత్తివానిపాలెంలో ఉన్న ఒక పాన్ షాప్‌పై అకస్మాత్తుగా దాడి చేపట్టారు. ఈ దాడిలో ఒమ్మి మోహన్ (42), స్థానిక నివాసి, అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి లైసెన్స్ లేకుండా ఉంచిన ఇంపీరియల్ బ్లూ (180 మిల్లీ లీటర్ల) ఆరు బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకుని, సంబంధిత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెందుర్తి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, తమ పరిధిలో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమాజంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

## మాతృమరణాలు అరికట్టాలి వైద్యాధికారులకే బాధ్యత

**కలెక్టర్ విజయ క్రిష్ణన్**




**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్,మే :02**

జిల్లాలో మాతృమరణాలు సంభవించకుండా చూడాల్సిన ప్రధాన బాధ్యత సంబంధిత ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులదేనని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ మాతాశిశు మరణాలు జరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, వాటి కారణాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వైలెన్స్ అండ్ రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశంలో జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో నమోదైన మాతాశిశు మరణాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయ ఆరోగ్య అధికారి డా. శ్రీనివాస్, 2026 జనవరి నుండి మార్చి వరకు జరిగిన నాలుగు మాతృ మరణాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య సేవలు సమయానికి అందించాల్సిన బాధ్యత మెడికల్ ఆఫీసర్లతో పాటు ఎఎన్ఎం లపైనా ఉంటుందని తెలిపారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హై రిస్క్ గర్భిణీలు ప్రసవానికి వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా జిల్లా ఆసుపత్రికి తక్షణం రిఫర్ చేయాలని, తద్వారా సురక్షిత ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై మాతృమరణాలు సంభవించినట్లయితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు కౌమార దశలో బాలికలకు శారీరక మార్పులు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. గర్భధారణ ప్రారంభం నుంచే గర్భిణీలకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు హై రిస్క్ కేసుల కోసం సమగ్ర బర్త్ ప్లానింగ్ చేపట్టాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. హైమావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, జిల్లా గణాంకాధికారి ఏ. రామచంద్రరావు, ప్రభుత్వ మరియు ప్రయివేటు ఆసుపత్రుల వైద్యులు, ఎ.ఎన్.ఎం. లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - కలెక్టర్ నిషాంతి హెచ్చరిక



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, మే:02**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రహదారి భద్రతను బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. రహదారి నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి సహనం చూపబోమని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి స్పష్టం చేశారు. ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని తగ్గించడం లక్ష్యంగా రవాణా శాఖ మరియు పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ చర్యలలో భాగంగా, వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ వంటి వాటిని ఎప్పటికప్పుడు వెంట ఉంచుకోవాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపడం, ఓవర్‌లోడింగ్ వంటి ప్రమాదకర చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రైవర్లపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 'బ్లాక్ స్పాట్స్' వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు సూచికలను మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. "రహదారి భద్రత అందరి బాధ్యత" అనే నినాదంతో, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా యంత్రాంగం ప్రజలకు పిలుపునిచ్చింది. ప్రజల సహకారమే ఈ కార్యక్రమం విజయానికి మూలమని అధికారులు పేర్కొన్నారు.

# కమలావతి బృందావనం రమణీయం

- ఔషధ, పండ్లు కూరగాయలు, ఆకుకూరల మొక్కలు
- తీగ జాతులు అత్యధికం
- చల్ దనం,ఆహ్లాదకరమైన వాతావరణం
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 02:**

కమలావతి బృందావనం రమణీయం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అన్నారు. వనమాలి, సిటిజి సంస్థల ఏరియా అడ్మిన్ లు శనివారం సాయంత్రం ఆరిలోవ లో కమలావతి బృందావనం లో నిర్వహించిన ప్రకృతి కార్యాశాలలో రత్నం పాల్గొని మాట్లాడారు. ఇంటి పై కప్పు మీద ఉన్న మొక్కలు అందరికీ కన్నుల పండువగా దర్శనమిచ్చాయి, సపోటా, దానిమ్మ, నిమ్మ నారింజ తదితర పండ్లు నోరూరించాయి. ప్రధానంగా ఔషధ, పండ్లు కూరగాయలు, ఆకుకూరల మొక్కలు, తీగ జాతులు అత్యధికంగా ఉన్నాయి. ఇంత మెండు వేసవిలో అక్కడ ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణం, ఆరోగ్యకరమైన గాలి, చల్లదనం అందరూ ఆనందానుభూతి పొందారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అడ్మిన్ లు కవిత, లలితా జ్యోతి, ఉష, ఉషారాణి లు మాట్లాడారు. పలువురు ఇంటి పై కప్పు మీద పంటలు పండించే వారు పాల్గొన్నారు.

# బీసీ కులాల సమగ్ర సర్వే పక్కాగా జరగాలి

## సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం బీసీ సర్వే తప్పనిసరి : రాజీవ్ రంజన్ మిశ్రా





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే:02**

వెనుకబడిన కులాల (బీసీ) సమగ్ర సర్వేను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కచ్చితంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్, బీసీ కమిషన్ సెక్రటరీ చంద్రశేఖర్ రాజు, ఇతర ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ, రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల స్థానిక సంస్థలలో వారి సామాజిక, ఆర్థిక స్థితి, ప్రభావాలపై సమకాలీన అనుభవాధారిత పరిశోధన (ఎంపిరికల్ ఎంక్వైరీ) నిర్వహించి, రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు సూచనల మేరకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనికోసం సమగ్ర డేటా సేకరణ అత్యంత కీలకమని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో బీసీ కులాలకు సంబంధించిన సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన సమాచారం సేకరించాలని, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను సరిగా ధృవీకరించాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల వారీగా జనాభా లెక్కలు నమోదు చేయాలని, సెన్సెస్ 2027 ప్రక్రియలో బీసీ వర్గాలకు సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచాలని అన్నారు. బీసీ కులాల్లోని ఉపకులాల వివరాలు, వారి పరిస్థితులపై సమాచారం సేకరించాలని, అన్ని పారామీటర్లను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అంచనా చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి అందిన వినతులు, సూచనలను పరిశీలించి న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ప్రస్తుతం జీవీఎంసీలో 98 వార్డులు ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా డిలిమిటేషన్ ప్రక్రియకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. సెన్సెస్ 2027 ప్రక్రియలో భాగంగా జనాభా లెక్కల సేకరణ కొనసాగుతోందని, టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా బీసీ వర్గాల జనాభాపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎలక్టోరల్ లిస్టుల ఆధారంగా సర్వే నిర్వహించి బీసీ వర్గాల జనాభా, ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు సత్యవేణి, డీవీ రమణమూర్తి, పి. నల్లనయ్య, జాయింట్ డైరెక్టర్ (అమృత్) విజయభారతి, ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సత్వర స్పందనతో మహిళకు న్యాయం అందించిన సీఐ దివాకర్ యాదవ్



**మహారాణి పేట, సిటిజన్ టైమ్స్,మే :02**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ఒక బాధిత మహిళ తనకు రావలసిన జీతాన్ని సంస్థ చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఫిర్యాదు చేసింది. ఉద్యోగం చేసినప్పటికీ నెలలుగా వేతనం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమె వివరించింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి వెంటనే స్పందించి కేసును మహారాణిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌కు అప్పగించారు. సీఐ దివాకర్ ఆలస్యం చేయకుండా చర్యలు ప్రారంభించి సంస్థ ప్రతినిధులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. బాధితురాలి వాదనలు, సంస్థ ప్రతినిధుల వివరాలను పరిశీలించి సమస్యను సమగ్రంగా విశ్లేషించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లిన సీఐ దివాకర్, సంస్థపై అవసరమైన ఒత్తిడి తీసుకువచ్చి, బాధిత మహిళకు రావలసిన రూ.60,000 బకాయి జీతాన్ని తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టారు. దీతో మహిళకు న్యాయం లభించింది. తన సమస్యను వేగంగా పరిష్కరించినందుకు బాధిత మహిళ సంతోషం వ్యక్తం చేసింది. త్వరితగతిన స్పందించి న్యాయం అందించిన పోలీస్ వ్యవస్థపై ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ విషయం ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నదని స్పష్టమవుతోంది. సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి పరిష్కారం చూపడంలో పోలీస్ శాఖ చురుకైన పాత్ర పోషిస్తోంది. సీఐ దివాకర్ చూపిన చొరవ, సమస్యను సమర్థవంతంగా పరిష్కరించిన తీరు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతోంది.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు: బి కొత్తకోట కమిషనర్

**అన్నమయ్య మదనపల్లి జిల్లా**
**బి కొత్తకోట సిటిజన్ టైమ్స్ మే 2**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బి కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ రమాదేవి హెచ్చరించారు శనివారం పట్టణంలోని సింహ వీధిలోని గడ్డ బావి వద్ద స్థానికులు వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న ప్రభుత్వ స్థలాన్ని కమిషనర్ సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు ఆ ప్రదేశంలో చుట్టూ పైపులతో ఫెన్సింగ్ వేయించి స్థానికులు నాయకులతో కలిసి మొక్కలు నాటారు ఇల్లు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి... అధికారులకు కలెక్టర్ ఆదేశాలు







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :02**

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అభివృద్ధి పనుల అమలులో ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులకు సూచించారు. వివిధ సందర్భాల్లో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలు, అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమ అంశాలపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు కనెక్టివిటీ, తీరప్రాంత అభివృద్ధి, తాగునీటి సరఫరా, ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాలు తదితర అంశాలపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా స్థాయిలో అమలు చేయగల పనులకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని, రాష్ట్ర స్థాయి అంశాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గంగవరం పోర్ట్ నుంచి శీలానగర్ వరకు ప్రతిపాదిత రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, యారాడ గంగవరం ప్రాంతాల్లో బ్రేక్‌వాటర్ జెట్టి ఏర్పాటు వంటి మత్స్యకారుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చిలకపేట సరస్సు పార్క్ అభివృద్ధి, కోస్తా కారిడార్ ప్రాజెక్ట్ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అలాగే హార్బర్ ఆధునికీకరణ, ద్వారకా బస్ స్టాండ్ అభివృద్ధి, డ్రైనేజ్ సమస్యల పరిష్కారం, కొత్త యూపీహెచ్సీల ఏర్పాటుకు స్థలాల ఎంపిక వంటి అంశాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తగరపువలసలో ఆర్టీసీ డిపో ఏర్పాటు, మధురవాడ, భీమిలి ప్రాంతాల్లో పీహెచ్‌సీల ఉన్నతీకరణ, కింగ్ జార్జ్ ఆసుపత్రిలో ఓపీ బ్లాక్ ఆధునికీకరణ, ఎంసీహెచ్ బ్లాక్ పునరుద్ధరణ, మౌలిక వసతుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తీర ప్రాంతాల్లో అవసరమైన చోట్ల బీచ్ రోడ్ రక్షణ గోడల నిర్మాణం, ఏపీఐఐసీ పరిధిలోని ఆక్రమిత భూముల రెగ్యులరైజేషన్, మార్కెట్ విలువల ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తోటగరువు జూనియర్ కళాశాల స్థాపనకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై సంబంధిత అధికారులు నిర్దిష్ట గడువులో చర్యలు పూర్తి చేసి పురోగతిని నివేదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమన్వయంతో పనిచేస్తే వేగవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు శేషశైలజ, సంగీత్ మాధుర్ మరియు అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వేగమే వధించింది... హైవేపై విషాదం...





**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, మే:02**

ఆనందపురం మండలం శొంఠ్యం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. అతివేగమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో అనకాపల్లి నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పై ఉన్న ఐరన్ బ్యారికేడ్‌ను దాటి సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉండగా, ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇక సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో విజయవాడ నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు, అనకాపల్లి నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని విజయనగరం జిల్లా గొర్ల మండలం పల్లిగంట్రేడు గ్రామానికి చెందిన డి. ఈశ్వరరావుగా గుర్తించారు. ఈ రెండు ప్రమాదాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తన సిబ్బందితో వెంటనే చర్యలు తీసుకున్నారు. సీఐ వాసునాయుడు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పారిపోయిన మైనర్ అబ్బాయి.. క్షేమంగా తల్లి చెంతకు చేరిక

**– శభాష్ సీఐ దివాకర్ యాదవ్**



**మహారాణి పేట, సిటిజన్ టైమ్స్,మే :02**

విశాఖపట్నం నగరానికి చెందిన ఒక మైనర్ బాలుడు కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో, ప్రేమ పేరుతో ఇల్లు వదిలి పారిపోయిన ఘటన మరోసారి వెలుగులోకి వచ్చింది. తండ్రి మరణంతో ఒంటరి తల్లితో నివసిస్తున్న ఈ బాలుడు, కొంతకాలంగా ఒక అమ్మాయితో పరిచయం పెంచుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇలాంటి ఘటనలో ఇదే బాలుడు గతంలో కూడా కనిపించకుండా పోవడంతో, నాలుగు నెలల క్రితం పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చేపట్టి గుర్తించి తల్లికి అప్పగించారు. అయితే ఇటీవల మళ్లీ అదే అమ్మాయి కోసం, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, మొబైల్ ఫోన్ కూడా వినియోగించకుండా ఇంటి నుంచి పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి ఆదేశాల మేరకు కేసును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బాలుడి కదలికలను విశ్లేషిస్తూ, సాంకేతిక ఆధారాలను వినియోగించి అతను హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ కీలక పాత్ర పోషిస్తూ, తన బృందంతో కలిసి హైదరాబాద్ వెళ్లి బాలుడిని సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం అతన్ని విశాఖపట్నానికి తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఈ ఘటనలో పోలీసు కమిషనర్ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలు, సమన్వయంతో జరిగిన చర్యలు, అలాగే సీఐ దివాకర్ యాదవ్ చూపిన చురుకుదనం, కర్తవ్యనిబద్ధత ప్రత్యేకంగా నిలిచాయి. పిల్లల భద్రత విషయంలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, ఇలాంటి ఘటనలను అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, వారితో నిరంతరం సంభాషణ కొనసాగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 నంబర్‌కు కాల్ చేయాలని సీఐ దివాకర్ విజ్ఞప్తి చేశారు.

## సవరప్పాలెంలో స్వామివార్ల కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 2**

రూరల్ మండలం సవరప్పాలెంలో జరిగిన శ్రీ రమా సత్యనారాయణస్వామి, అంబికా విశ్వేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవానికి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు హాజరై స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. భక్తిపారవశ్యంతో జరిగిన ఈ వేడుకలో గ్రామస్తులతో కలిసి ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు,బొర్రా ఈశ్వరరావు, సత్తి ప్రసాద్ ,సత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్ సేవల్లో మెరుగుదల తప్పనిసరి: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే :02**

ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రధాన ఆరోగ్య కేంద్రంగా నిలిచిన కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్) ప్రతిష్ఠకు అనుగుణంగా వైద్య సేవలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఉదయం కేజీహెచ్‌ను సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. ఓపీ, క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ వార్డులను సందర్శించి అక్కడి సేవలపై సమీక్ష చేశారు. అనంతరం సీఎస్సార్ బ్లాక్‌లోని ల్యాబ్‌లను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలోని పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యులతో సమావేశమై వివిధ విభాగాల సేవలు, సమస్యలు, అవసరాలపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న పడకల సామర్థ్యం, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆధునిక పరికరాల వినియోగం, పారిశుద్ధ్యం, పార్కింగ్ వసతి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విభాగాధిపతులు ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలపై త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర స్థాయి అంశాలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేజీహెచ్‌కు ఉన్న విశిష్టత, పేరును నిలబెట్టేలా వైద్యులు పనిచేయాలని, ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఐ. వాణి మరియు ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## అక్రమ లింగ నిర్ధారణపై కఠిన నిఘా : కలెక్టర్ విజయ క్రిష్ణన్






**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్,మే :02**

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో గర్భధారణకు పూర్వం మరియు ప్రసవ పూర్వ నిర్ధారణ పద్ధతుల (పిసిపిఎన్ డి టి) చట్టం--1994ను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వైద్యాధికారులతో చట్ట అమలుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అన్న విషయంపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ తప్పనిసరిగా జిల్లా అథారిటీ వద్ద రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, అన్ని రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. హైమావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, జిల్లా గణాంకాధికారి ఏ. రామచంద్రరావు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా పదోన్నతి పొందిన సీఐ ఎస్. లక్ష్మణమూర్తికి ఘన వీడ్కోలు

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :02**

అనకాపల్లి జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ) సీఐగా విధులు నిర్వహించిన ఎస్. లక్ష్మణమూర్తి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు మాట్లాడుతూ, లక్ష్మణమూర్తి సేవలను ప్రశంసించారు. మూడు దశాబ్దాలపాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సేవలందించి, తన కర్తవ్యనిష్ఠతో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఇదే నిబద్ధతతో డీఎస్పీగా కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎస్బీ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ మాట్లాడుతూ, పదోన్నతి పొందిన లక్ష్మణమూర్తి కి అభినందనలు తెలియజేశారు. డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్న ఆయన వృత్తి జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు లక్ష్మణమూర్తి ని ఘనంగా



సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో సి. హెచ్. తిలక్ బాబు, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి, సేనం రమేష్, పిల్లా రమేష్, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, అంజిబాబు, గిరి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్యాస్ ధరల పెంపు వెంటనే వెనక్కి తీసుకోలి : సీపీఐ డిమాండ్







**జగదాంబ, సిటిజన్ టైమ్స్, మే :02**

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జగదాంబ బస్ స్టాప్ వద్ద ధర్నా నిర్వహించారు. సిలిండర్‌పై 993 రూ. పెంపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రహిమాన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను అపూర్వంగా పెంచిందని తీవ్రంగా విమర్శించారు. ఈ పెంపుతో ఫైవ్ స్టార్ హోటళ్ల నుండి వీధి టిఫిన్ బండ్ల వరకు ఆహార పదార్థాల ధరలు పెరిగి, చివరికి భారమంతా సామాన్య ప్రజలపైనే పడుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, ఓటు వేసి గెలిపించిన ప్రజలపై భారాలు మోపడం అన్యాయమని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ విధంగా ధరలు పెరగడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, ఇది "గోరుచుట్టుపై రోకలి పోటు" లాంటిదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ పెంపు మరింత భారంగా మారిందన్నారు. తక్షణమే ధరలను తగ్గించకపోతే ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేస్తూ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎం. పైడిరాజు, ఎం. మన్మధరావు, జి. రాంబాబు, జి. జయకే తిరుపతిరావు, జయకే లక్ష్మణరావు, కొమర సందీప్, ఎం. శ్రీనివాసరావు, తెడ్డి వెంకటేశ్వరరావు, వి. నల్లయ్య, ఈ. శ్రీను, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ చర్యలు హాస్యాస్పదం

**వంటెద్దు వెంకన్నాయుడు**



అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 2 :మన రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పనులు పూర్తిచేయడానికి డబ్బులు లేవు అంటూనే ఆ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి అడుగులు వేస్తున్న ఈ ప్రభుత్వం భవన నిర్మాణాలు పూర్తికాకుండానే కేవలం అద్దాలకు 2500 కోట్లు కేటాయింపులు జరపడం హాస్యాస్పదంగా ఉందని, వైస్సార్సీపీ కార్యదర్శి (పార్లమెంటరీ) మండపేట నియోజకవర్గ పరిశీలకులు వంటెద్దు వెంకన్నాయుడు వ్యాఖ్యనించారు.ఆడబిడ్డ నిదికి డబ్బులు లేవు, నిరుద్యోగ భృతికి లేవు,ఉన్న పింఛన్లలో సుమారు 6లక్షల పింఛన్లు తీసేసి కొత్తవేమి ఇవ్వకుండా,దివ్యాంగులకు పింఛన్ల విషయంలో తీవ్ర అన్యాయం చేసారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా పరిపాలనను ప్రజలు గమనించి ప్రశ్నిచాలని ఆయన అన్నారు.కనీసం పెట్రోల్, డీజిల్ సమస్యని పరిష్కరించలేని కూటమి సర్కార్ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని నాయుడు అన్నారు.

# గ్యాస్ కష్టాలు తీరేది ఎప్పుడు. చింతలపూడిలో గ్యాస్ కష్టాలు



**చింతలపూడి:( సిటిజన్ టైమ్స్ ): మే :02**

ఒక్క ఏజెన్సీ కే ఇరవై ఐదు వేల కనెక్షన్ లు ఉండటం వలన ఈ కష్టాలు . మిగతా ఏజెన్సీ లకు ఎందుకు లేదు. అంటే వారివి కేవలం ఐదు వేల కనెక్షన్ లు మాత్రమే. అయితే ఒక్క ఏజెన్సీ కు ఉన్న ఇరవై ఐదు వేల కనెక్షన్ లు మిగతా ఏజెన్సీల కు సరిపడా బదిలీ చేయచ్చు కదా అని ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలు. ఐదు వేల కనెక్షన్ లు ఉన్న ఏజెన్సీ కు దానికి తగ్గట్టు గ్యాస్ సరఫరా ఉన్నట్టు,ఇరవై ఐదు వేలు ఉన్న ఏజెన్సీ కు దానికి తగ్గట్టు గానే సరఫరా ఉంటుంది అని ప్రశ్నిస్తున్న సంఘాలు . బ్లాక్ లో సిలిండర్ లు అమ్ముడు పోతున్నాయా లేదా లేక ఈ కేవైసీ సాకు చూపిస్తున్నారా అనేది తెలియడం లేదు. చింతలపూడి ఏజెన్సీ వద్ద వినియోగ దారులు ఎండలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కాకినాడలో వేసవి విజ్ఞాన శిబిరాలు





**కాకినాడ సిటిజన్ టైమ్స్ మే 2**

కాకినాడలో వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని , విద్యార్థులచే ఉదయం 8 గం.ల నుండి 8:30 గం.ల వరకు గ్రంథాలయంలో ఉన్నటువంటి రకరకాల కథల పుస్తకములు చదివించడం జరిగినది. 8:30 గం.ల నుండి 9:15 గం.ల వరకు డి ఆర్ డి ఏ నిపుణులు సత్య బాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థుల మేధాశక్తిని పెంచే ఆటలు పై శిక్షణ ఇవ్వడం జరిగినది. 9:15 గం.ల నుండి 10:15 గం.ల వరకు జేఎన్టీయూ అసిస్టెంట్ డైరెక్టర్ డా.సుధా దేవి గారు విద్యార్థిని, విద్యార్థులకు యోగ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగినది. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా విద్యార్థులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని వారి వ్యక్తిత్వ వికాసానికి యోగ దోహదం చేస్తుందని తెలియజేశారు. 10:15 గం.ల నుండి 10:20 గం.ల వరకు విద్యార్థినీ విద్యార్థులకు విరామం అల్పాహారం పంపిణీ చేయడం జరిగినది. 10:20 గం.ల నుండి 11:00 గం.ల వరకు విశ్రాంత ఉపాధ్యాయులు నోరి బలరామ కృష్ణ విద్యార్థినీ విద్యార్థులకు స్టూడెంట్ మ్యాజిక్, మ్యాథమెటిక్స్ పజిల్స్, పర్యావరణ పరిరక్షణపై పాటలు నేర్పించటం మైండ్ గేమ్స్ ఆడించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, గ్రంథాలయ సిబ్బంది కుమార్, వీర్రాజు, ఫణీంద్ర కుమార్ దుర్గా ప్రసాద్, అరుణ కార్యాలయ సిబ్బంది సాయి వెంకట్రావు స్థానిక పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులు 82 మంది పాల్గొనడం జరిగినదని ఒక ప్రకటనలో తెలిపారు.

# బంగారం దొంగతనం కేసులో ఐదుగురు నిందుతులు అరెస్ట్ : ఎస్పీ మహేశ్వర రెడ్డి








**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, మే:02**

కాశీబుగ్గ పట్టణంలోని నిత్యానందనగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జువెలరీ షాప్‌లో జరిగిన సంచలన డెకాయిటీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నాలుగు ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు జరిపి ఐదు మంది నిందితులను అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన భారీ మొత్తంలో సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు దోపిడీకి గురవగా, వాటిలో 243 గ్రాముల బంగారం, రూ.3,41,000 నగదు, రెండు పిస్టల్స్, కార్ట్రిడ్జులు, రెండు మ్యాగజైన్లు, 12 మొబైల్ ఫోన్లు, అలాగే దోపిడీ సొత్తుతో కొనుగోలు చేసిన రెండు కార్లు, నేరానికి ముందు ఉపయోగించిన మరో రెండు కార్లను పోలీసులు రికవరీ చేశారు. మొత్తం రికవరీ విలువ సుమారు రూ.49 లక్షలు గా అంచనా వేశారు. అరెస్టైన వారిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగురు, కాశీబుగ్గకు చెందిన ఒకరు ఉన్నారు. తిరుమల పాత్రో అనే వ్యక్తి స్థానికంగా దొంగ బంగారం కొనుగోలు చేసి విక్రయించే వ్యక్తిగా గుర్తించబడగా, ఇతడే ఇతర నిందితులకు సహకరించి జువెలరీ షాప్‌పై రేకీ నిర్వహించి దోపిడీకి మార్గం సుగమం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ గ్యాంగ్ ఒడిశాలో పలు ప్రాంతాల్లో ఇదే తరహా నేరాలకు పాల్పడుతూ, ఇప్పటివరకు 32 కేసుల్లో నిందితులుగా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 7న మధ్యాహ్నం సమయంలో నిందితులు జీఎస్టీ అధికారులమని చెప్పుకొని షాప్‌లోకి ప్రవేశించి, గ్లౌజులు, మాస్కులు ధరించి సీసీ కెమెరాలపై నల్ల స్ప్రే పిచికారీ చేశారు. అనంతరం షాప్ యజమానికి హ్యాండ్‌కఫ్స్ వేసి, పిస్టల్స్‌తో బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. ఈ ఘటనకు ముందు డిసెంబర్, మార్చి నెలల్లో రేకీ నిర్వహించి, ఏప్రిల్ 5న ప్రయత్నం విఫలమైన తర్వాత, ఏప్రిల్ 7న ప్రణాళిక ప్రకారం నేరం అమలు చేశారు. టోల్ గేట్లను తప్పించుకునేందుకు మార్గాలను మార్చుకుంటూ భువనేశ్వర్ నుంచి కాశీబుగ్గకు చేరుకున్నట్లు దర్యాప్తులో తేలింది. కేసు ఛేదనలో భాగంగా పోలీసులు బ్యాంకుల సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా వాహనాలను గుర్తించి, వాటి కొనుగోలు వివరాలు, ఫైనాన్స్ సమాచారం సేకరించారు. ఆధార్, మొబైల్ నంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించి, గ్యాంగ్ నెట్‌వర్క్‌ను పూర్తిగా వెలికితీసి అరెస్ట్ చేశారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ సిబ్బంది సమన్వయం, సాంకేతిక వినియోగం ప్రశంసనీయమని ఎస్పి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు.

# జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**మదనపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 2.సిటిజన్ టైమ్స్.**



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లి కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదు అయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా... సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2025 సెప్టెంబర్ 10 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరకు జిల్లాలో మొత్తంగా 14 ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. కేసువారీగా పరిష్కార చర్లపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. కేసులలో ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని అన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తాసిల్దారులు వెంటనే జారీ చేయాలని, డివిజన్ స్థాయి అధికారులు దీనిని తగిన పర్యవేక్షించాలని సూచించారు. స్పీడ్ కేసులలో త్వరితగతిన జడ్జిమెంట్ వచ్చేలా పోలీస్, న్యాయశాఖ పిపీలు కృషి చేయాలని తెలిపారు.

**ఎస్సీ ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక**


జిల్లా నందలి ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో భూగర్భ జలాలు, నీటి వనరులు పెరిగాయి. ప్రతి గ్రామంలో ఆసక్తి గలవారికి పాలిచ్చే పశువులు పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ మేరకు ఎస్సీ ఎస్టీలను కూడా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మాన్సూన్ సీజన్ మొదలయ్యేలోపు ఆసక్తి గలవారు ముందుకు వస్తే డిఆర్డిఏ శాఖ ద్వారా ఎస్సీ ఎస్టీల మహిళ సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.... జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఇప్పటికే నమోదైన అండర్ ట్రయల్ కేసులు, వాటి పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్డిపిఓలు, డీవీఎంసీ సభ్యులతో సమీక్షించారు. జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల ప్రగతి, ఆయా అంశాలలో తీసుకున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్ మరియు ఎస్పి సందేహ నివృత్తి చేశారు. జిల్లాలో అన్ని మండలాలలో ఎస్సీ, ఎస్టీల స్మశాన వాటికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సభ్యులు కలెక్టర్ కు విన్నవించారు. ఈ అంశాలను ప్రత్యేక దృష్టితో సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.అంతకుముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు పరిష్కరించిన కేసులపై సమావేశంలో చర్చించి, ఇంకనూ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీరాములు, డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజశేఖర్, చంద్రశేఖర్ బోడేషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# విద్యార్థులుభవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కొండంత అండ

**కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళన - మంత్రి నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో పెరిగిన విద్యా ప్రమాణాలు.**

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.**



**దుగ్గిరాల ( సిటిజన్ టైమ్స్ ),: మే 02:**

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో దెందులూరు నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు నియోజకవర్గానికి గర్వకారణమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. శనివారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పలువురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సాధారణ మధ్యతరగతి, పేద కుటుంబాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చిన్నారులు మార్కులు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. "ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే నేడు ప్రభుత్వ విద్యార్థులు ఇంతటి ఘనవిజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు, యువతకు బంగారు భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తమ గ్రామానికి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయిరాయి జెడ్పీ హై స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పార్వతీపురం ఐటిడిఏకు కొత్త ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వైశాలి బాధ్యతల స్వీకారం



**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, మే :02**

పార్వతీపురం ఐటిడిఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఆర్. వైశాలి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయ సిబ్బంది, సంబంధిత విభాగాల అధికారులతో ఆమె సమావేశమై, గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్షించారు. గిరిజనుల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ సమగ్ర అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తానని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని, పారదర్శకతతో సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, అధికారులు కొత్త ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన వైశాలి గారిని అభినందించారు.

# ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు



**కృష్ణాజిల్లా : ( సిటిజన్ టైమ్స్):: మే 02**


బావులపాడు మండలం, వే లేరు గ్రామంలో గత నెల ముప్పై వ తారీకు నుండి ఘనంగా దోనవల్లి వాళ్ల ఇలవేల్పు అయినటువంటి తిరువులమ్మ, గురువులమ్మ, పేరంటాలమ్మ అమ్మవార్ల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మొదటిరోజు నూట ఎనిమిది. బిందెలతో జలాభి, చందనాభి, తేనాభి, పాలాభి, పంచామృత అభిషేకాలు మరియు అఖండ దీపారాధన, కలశ స్థాపన, గణపతి పూజ మొదలుకొని అభయాంజనేయ స్వామి కోలాట సమాజము , హనుమాన్ జంక్షన్ వలచే కోలాటం జరిగింది. రెండవ రోజు అలంకరణ , సర్వదర్శనము, లక్ష్మీ గణపతి భజన సమాజము , రేమల్లె వాళ్ల చే నూట ఎనిమిది సార్లు హనుమాన్ చాలీసా జరిగింది. అనంతరం మహా అన్నసమరాధన కార్యక్రమంలో సుమారుగా రెండు వేల మంది భక్తులు ప్రసాదాన్ని ఆరగించారు. మేళా తాళాలతో, కనకదప్పులతో , నారసారాలతో ఆ గ్రామ మహిళల జ్యోతులతో అంగరంగ వైభవంగా ఊరేగింపు ను నిర్వహించారు. సుందరకాండ పారాయణం, దేవి సారధ్యంలో కొండపల్లి బాల ఇన్ఫు స్కూల్ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన, కోదండరామ భజన సమాజము ఘనంగా జరిగింది. ఆ గ్రామ ప్రజలందరూ నిండు నూరేళ్లు, చల్లగా సంతోషంగా, ఎటువంటి కష్టనష్టాలు రాకుండా లేకుండా ఉండాలని, ప్రతి ఒక్క కుటుంబంలో సిరిసంపదలు కలగాలని మనస్ఫూర్తిగా ఈ ఉత్సవాలు జరిగాయని ఆలయ కమిటీ వాళ్లు పేర్కొన్నారు.

## కూటమి పాలన అద్భుతం



**ఏలూరు జిల్లా:( సిటిజన్ టైమ్స్ ): మే 02 :**
దెందులూరు నియోజకవర్గం, పెదవేగి మండలంలో గల జగన్నాధపురం గ్రామ తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు చిలకలపూడి సురేష్ బాబు సీనియర్ నాయకులు రాజా రామ్ మోహన్ రావు ( రమేష్) మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి కులం, మతం, భాష , పార్టీ బేధం లేకుండా సూపర్ సిక్స్ పథకాలు అందాయని అన్నారు. ఆ పంచాయతీలలో ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారో తెలిపారు. వీధి దీపాలు, నీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ మొదలైనవి బాగానే ఉన్నాయని వివరణ అందించారు. నిరుపేదలకు ఇళ్ళు, కొత్త పెన్షన్ లు సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించి తక్షణమే వాటిని అమలు పరచాలని కోరారు. శాసనసభ్యులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారం దిశగా ముందుంటున్నారని అన్నారు. ఎప్పుడు స్థానిక ఎన్నికల నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి తిరుగు లేదని ప్రజలు అంటున్నారని సూచించారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పడం జరిగింది. పంచాయతీరాజ్ శాఖ నుండి ఆయా గ్రామాలకు ఎన్ని నిధులు వచ్చాయో , వాటిని ఆ గ్రామాల అభివృద్ధికి ఉపయోగించమని పేర్కొన్నారు. కూట మి పాలన అద్భుతమని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## పార్టీలో చేరిన 20 కుటుంబాలు



**ముసునూరు:( సిటిజన్ టైమ్స్ ): మే:02:**
నూజివీడు నియోజకవర్గం, ముసునూరు మండలం, ముసునూరు గ్రామంలో రాజకీయ పరంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసిపి పార్టీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. ఫోకస్ బూత్‌లు 82, 83 పరిధిలోని ఈ కుటుంబాలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సూచనల మేరకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి ఉదయ్ కిరణ్ , గ్రామ పార్టీ అధ్యక్షులు గార్లపాటి నరసింహా రావు ఆధ్వర్యంలో ముసునూరు మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘుబాబు , మాజీ మండల పార్టీ అధ్యక్షులు దేవినేని డెలారామ్ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఫోకస్ బూత్ అబ్జర్వర్ శేషపు శేషగిరిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం సజావుగా కొనసాగింది. పార్టీలో చేరిన కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నమ్మకంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చేరికతో ముసునూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలపడినట్లు స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రెసిడెంట్ దేవినేని శ్రీధర్ , నక్క యోహాను గ, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో మాయాజాలం -పట్టించుకోని అధికారులు

**అల్లవరం, సిటిజన్ టైమ్స్ మే 2**
ప్రతీ పేదవానికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారు. అయితే క్రింది స్థాయి అధికారులు అక్రమ మార్గంలో అక్రమంగా సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఉపాధి హామీ పథక పనులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలున్నాయి. అయితే అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో క్రింది స్థాయి అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా జరుగుతుందంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలో డ్రైయిన్లు పంట బోదెలు పనులు చేసేందుకు తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు నమ్మించి శాంక్షన్ ఆర్డర్ వచ్చి పనులు చేపట్టవలసి ఉండగా కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు వేరే పనులు చేసి అక్రమ మార్గంలో అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపణలున్నాయి. గురువారం, శుక్రవారం ఒక రైతు పంట పొలం కోత పనులు ఉపాధి హామీ కూలీలుతో చేయించి డ్రయిన్ పనుల్లో మస్తర్లు వేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈవిషయం మండల స్థాయి అధికారులకు పలువురు సమాచారం ఇవ్వగా,వారు గ్రామాల్లో పర్యటించి తనిఖీ చేయాల్సి ఉండగా, మండలానికి సంబంధించి ఏపీవో రాజామణి పీల్డ్ అసిస్టెంట్‌ను మీరు డ్రయిన్ పంట బోదె పనులు చేయకుండా కోత పనులు చేయిస్తున్నరని సమాచారం వచ్చిందని ప్రశ్నించారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల కొంత మంది కూలీలను మాసూలు పనులకు పంపించినట్లు సదరు పీల్డ్ అసిస్టెంటు ఏపీవోకు చెప్పినట్లు సమాచారం.ఈ విషయంపై ఏపీవో రాజామణిని వివరణ కోరగా శనివారం విచారణ చేసి సమాచారం అందిస్తానని దాటవేశారు. అయితే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

# పసవర్ధక శాఖ జిల్లా అధికారిగా విజయారెడ్డి

## కలెక్టర్ జాయింట్ కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసిన విజయా రెడ్డి

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 2**
వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమ జిల్లా ఆర్థిక వ్యవస్థలో పశుసంవర్ధక శాఖది కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,పశుసంవ ర్ధక శాఖ జిల్లా అధికారిగా ఎల్.విజయా రెడ్డి ఇన్చార్జి గా శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన భవానీ ప్రసాద్ జిల్లా కలెక్టర్ వారికి సహాయ సంచాలకులు ఎల్. విజయా రెడ్డి పరిచయంచేసి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారిగా ఇన్చార్జిగా నియమించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆయన భవా నీప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వారిని మర్యాద పూర్వకంగా కలవగా జిల్లా కలెక్టర్ స్వాగతించారు .నూతన అధికారి తన అను భవంతో కోనసీమ దాన తదితర కార్యక్రమాల ద్వారా పాడి రైతులకు అండగా నిలుస్తారని ఆశిస్తున్నాన న్నారు. జిల్లాలో పశుగణాభివృద్ధి, పాడి రైతుల సంక్షేమం దృష్ట్యా అనుసరించాల్సిన పనితీరుపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.? ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా విధి నిర్వ



హణలో అత్యంత పారదర్శకతను పాటించాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ జవాబుదారీ తనంతో పనిచేయాలని సూచించారు. పశువైద్య సేవలు కేవలం కార్యాల యాలకే పరిమితం కాకుండా, రైతులకు చేరువుగా శాఖపరమైన సేవలను మారుమూల గ్రామాల్లోని పాడి రైతుల ముంగిటకే చేర్చాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మొబైల్ వెటర్నరీ క్లినిక్ల వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పశువులకు



సంభవించే గాలికుంటు వ్యాధి వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, టీకాల పంపిణీ కార్యక్ర మాన్ని యుద్ధప్రతిపాదికన చేపట్టాలని సూచించారు.జిల్లా యం త్రాంగంతో కలిసి పనిచేస్తూ, పశుగ్రాసం, దానా కొరత లేకుండా చూడటం, పాల ఉత్పత్తిలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో ఉప సంచాలకులు కే. చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్యే



**తాడేపల్లిగూడెం:( సిటిజన్ టైమ్స్): మే:02:**
మంచి విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. స్థానిక విడిది కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఈ సంవత్సరం తాడేపల్లిగూడెం మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మంచి ఫలితాలు సాధించేదుకు అంకితభావంతో కృషి చేసిన ఉపాధ్యాయులను,విద్యాశాఖ అధికారులను, తల్లిదండ్రులను ఆయన అభినందించారు. వచ్చే సంవత్సరం 100 శాతం ఫలితాల కోసం కృషి చేయాలని కోరారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. పట్టణంలో జిల్లా పరిషత్తు హై స్కూల్ ఆవరణలో క్రీడా ప్రాంగణాన్ని అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం,ఉపాధ్యాయులు,విద్యార్థుల శ్రమతో మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో మొత్తం 1235 మంది విద్యార్థులు 10 వ తరగతి పరీక్షలకు హాజరయ్యారని, 979 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సంవత్సరం 80శాతం ఉత్తీర్ణత సాధించామని అన్నారు. 231మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని అన్నారు. కడకట్ల బీసీ గురుకుల పాఠశాల, మారంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, కృష్ణాయ పాలెం పాఠశాలల్లో 100% ఫలితాలు సాధించారని అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధికంగా 29 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని వివరించారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు కోసం కృషి చేస్తామని ఆమె తెలియజేశారు. ఈ అభినందన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా అమరజీవి జలధార పనులు

**వాడపాలెంలో 90 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం సంపు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించిన ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట సిటిజన్ టైమ్స్ మే 2**
ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు ఇంటింటికి సరఫరా చేసేందుకే అమరజీవి జలధార పనులను ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులలో భాగంగా వాడపాలెంలో 90 వేల లీటర్ల వాటర్ ట్యాంక్,6లక్షల లీటర్ల సంప్ పనులకు, వాచ్మెన్ రూమ్ నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బర్లంక నుంచి గోదావరి నీరు పైప్లైన్ ద్వారా తీసుకుని వచ్చి వసంతవాడ గ్రామం వద్ద వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి కొత్తపేట, పి గన్నవరం, రాజోలు, అమలాపురం నియోజకవర్గం లో కొంత భాగం, మొత్తం మూడు నియోజకవర్గాలు పూర్తిగా, అమలాపురం నియోజకవర్గంలో కొంత భాగం ప్రజలకు ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా రూ.800 కోట్లతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. అమరజీవి జలధార పేరుతో రూ.1650 కోట్లతో పశ్చిమగోదావరి జిల్లా పెరవలిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. అందులో సగం నిధులతో మన కొత్తపేట నియోజకవర్గంలో వసంత వాడలో మెయిన్ హెడ్ వర్క్స్ ప్రాజెక్టు నిర్మితమవుతుందన్నారు. సురక్షితమైన మంచినీటిని



ప్రతి గ్రామానికి తీసుకుని వచ్చి అక్కడ నుంచి ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా చేసే విధంగా ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగా వాడపాలెంలో 90 కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంకు కు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మారెమ్మ కాలనీ పక్కన 6 లక్షల లీటర్ల స్టోరేజ్ ట్యాంకు (సంపు) నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కొత్తపేట, వానపల్లి, వాడపాలెం, మందపల్లి, బిల్లకుర్రు మొదలైన గ్రామాలకు తాగునీటి సరఫరా ఈ సంపు నుంచి జరుగుతుందన్నారు. రూ.200 కోట్ల రూపాయలను కొత్తపేట నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టు కింద ఖర్చు పెడుతున్నారన్నారు.

## అల్లవరంలో భక్తాంజనేయ స్వామి వారి వార్షికోత్సవం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆనందరావు

**అల్లవరం సిటిజన్ టైమ్స్ మే 2**
అల్లవరం మండలం,లోని అల్లవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి వార్షికోత్సవ వేడుకల్లో శనివారం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరికీ ఆ హనుమంతుడి ఆశీస్సులు లభించాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించిన శాసనసభ్యులు ఆనందరావు, భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు నిర్వహిస్తున్న ఈ వార్షికోత్సవ వేడుకలు ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని వచ్చిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు,రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, బొర్రా ఈశ్వరరావు,ముత్యాల బాబీ, బండిగుప్తపు సత్తిబాబు, కంకిపాటి గోపి,కంకిపాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



## 7న రామచంద్రపురంలో జాబ్ మేళా

**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ మే 2**



రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా వారం వారం జరుగుతున్న జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 7 న ఉదయం 10:00 నుండి కెవిఆర్ హాస్పిటల్ దగ్గర గల ఉపాధి ఆఫీసులో 42 వ జాబ్ మేళా నిర్వహింప బడుతుంది. 18 నుంచి 26 సంవత్సరాలలోపు ఐటిఐ చదివిన పురుష అభ్యర్థులకు వరుణ్ బెవరైజస్ లో శ్రీ సిటీ లో పనిచేసే విధంగా 23 వేల వరకు జీతంతో ఆపరేటర్ పోస్టులకు మరియు గుమనంపూడిలో టీవీఎస్ కంపెనీలో 18 నుంచి 26 సంవత్సరాలలోపు టెన్త్ ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బీటెక్ చదివిన స్త్రీ అభ్యర్థులకు సుమారు 19000 లభించే విధంగా ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించబడుతుంది. మరిన్ని వివరాలకు 9515481671 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరు.అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించండి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ మే 2**
అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ సార్వత్రిక విశ్వవిద్యాలయం కి సంబంధించి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫీజు నోటిఫికేషన్ విడుదలైందని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 19 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ మదన్ మోహన్ అంబేద్కర్ సార్వత్రిక అధ్యయన కేంద్రం సమన్వయకర్త అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం 6వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 14 నుంచి 19 వరకు, 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 21 నుంచి 28 వరకు, 2వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 30 నుంచి జూలై 6 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. మరింత సమాచారం కోసం నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.


## అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అల్లవరం సిటిజన్ టైమ్స్ మే 2**
మండలం,లోనియెంట్రుకోన గ్రామంలో వైభవంగా జరుగుతున్న శ్రీ కనకలక్ష్మి వేములమ్మ అమ్మవారి జాతర,తీర్థ మహోత్సవాలకు శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్న జాతర, తీర్థ వేడుకల్లో భక్తులతో కలిసి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, బొర్రా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ , ముత్యాల బాబీ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గెద్దాడ శ్రీనివాసరావు, ఆర్టికల్చర్ డైరెక్టర్ నార్గన శ్రీనివాసరావు, వంగా దొరయ్య నాయుడు, వర్రే సూరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## దివంగత నాదెండ్ల భాస్కరరావు శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొన్న పి. గన్నవరం నియోజకవర్గ శ్రేణులు

**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ మే 2**
రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు పెద్దకర్మ కార్యక్రమం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని, నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పి. గన్నవరం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ శ్రద్ధాంజలి ఘటించారు.



# ఖాన్‌ల త్రయం తలో దారి వెతుక్కున్నారు!



రూహీ సింగ్ టైమ్‌లెస్ జ్యువెలరీ లుక్‌తో లగ్జరీని పునర్నిర్వచించారు



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో దశాబ్దాలుగా తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న ఖాన్‌ల త్రయం షారూఖ్, సల్మాన్, అమీర్ ప్రస్తుతం తమ కెరీర్‌లో విభిన్నమైన దశల్లో ఉన్నారు. ఒకప్పుడు ముగ్గురూ బాక్సాఫీస్ వద్ద పోటాపోటీగా సినిమాలు విడుదల చేసేవారు.. కానీ ఇప్పుడు వారి ప్రాధాన్యతలు మారాయి. ఒకరు వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో ఉండగా..మరొకరు భారీ కాంబినేషన్‌పై కన్నేశారు. ఇంకొకరు మాత్రం నటుడి కంటే నిర్మాతగానే ఎక్కువ ఆసక్తి చూపిస్తుండటం బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన తన కుమార్తె సుహానా ఖాన్‌ను వెండితెరకు పరిచయం చేసే బాధ్యతను భుజానికెత్తుకున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం -కింగ్- పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తండ్రీకూతుళ్ల క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాను 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా సుహానా కెరీర్‌ను పటిష్టం చేయడమే కాకుండా.. తన బాక్సాఫీస్ స్టామినాను మరోసారి నిరూపించుకోవాలని షారూఖ్ భావిస్తున్నారు. మరోవైపు టాలీవుడ్ ట్యాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి .. ప్రముఖ నిర్మాత దిల్ రాజులతో కలిసి సల్మాన్ ఖాన్ ఒక భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తున్నారు. సౌత్ మేకింగ్ స్టైల్‌ను తన మాస్ ఇమేజ్‌కు జోడించి సరికొత్త మేజిక్ చేయాలని సల్మాన్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ మూవీ 2027 రంజాన్ విడుదలను టార్గెట్ చేస్తూ రూపుదిద్దుకుంటోంది. తన ఆస్థాన పండుగ అయిన రంజాన్ సీజన్‌ను మళ్లీ సొంతం చేసుకునేలా సల్మాన్ ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. నటుడిగా ఆయన ఇంకా ఏ చిత్రాన్ని అధికారికంగా ఖరారు చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఆయన దృష్టి అంతా నిర్మాణ రంగంపైనే ఉంది. ఆయన నిర్మాణంలో ఏక్ దిన్, లాహోర్ అనే రెండు చిత్రాలు శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. ఇందులో -ఏక్ దిన్- చిత్రంలో అమీర్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తుండగా, సాయిపల్లవి కథానాయికగా నటిస్తోంది. 2026 మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. నటుడిగా విరామం తీసుకున్నా జునైద్ కెరీర్ ని చక్కదిద్దేందుకు నిర్మాతగా కృషి చేస్తున్నారు. అలాగే నాణ్యమైన చిత్రాలను అందించడమే లక్ష్యంగా అమీర్ ముందుకు సాగుతున్నారు.మొత్తానికి ఈ ముగ్గురు స్టార్ హీరోలు తమ భవిష్యత్తు ప్రణాళికలను చాలా స్పష్టంగా సిద్ధం చేసుకున్నారు. షారూఖ్ తన వారసురాలితో కలిసి బిజీగా ఉండగా, సల్మాన్ సౌత్ టెక్నీషియన్లతో పాన్ ఇండియా మార్కెట్‌ను గురిపెట్టారు. అమీర్ ఖాన్ మాత్రం తెర వెనుక ఉండి చిత్ర నిర్మాణంలో తనదైన ముద్ర వేయాలని చూస్తున్నారు. అప్ కమింగ్ రెండు మూడేళ్లు ఈ ఖాన్‌ల త్రయానికి కెరీర్ పరంగా అత్యంత కీలకంగా మారనున్నాయి.



మండుతున్న రెడ్ గ్లామ్ లుక్‌లో సాక్షి మాలిక్ స్టన్స్

## మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు ఇదే..

# సంచలన పేసర్‌కు తొలి అవకాశం!


- మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ
- గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగి వచ్చిన యాస్తిక భాటియా
- స్పిన్నర్ రాధా యాదవ్‌కు మళ్లీ చోటు
- డబ్ల్యూపీఎల్‌లో రాణించిన యువ పేసర్ నందిని శర్మకు తొలిసారి అవకాశం
- జూన్ 14న పాకిస్థాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది




జూన్ 12 నుంచి జరగనున్న 2026 మహిళల టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధన వైస్ కెప్టెన్ గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో వికెట్ కీపర్ యాస్తిక భాటియా, స్పిన్నర్ రాధా యాదవ్ పునరాగమనం చేయగా, డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటిన యువ ఫాస్ట్ బౌలర్ నందిని శర్మకు అనూహ్యంగా తొలిసారి అవకాశం దక్కింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, చీఫ్ సెలక్టర్ అమితా శర్మ ఈ వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.మోకాలి శస్త్రచికిత్స కారణంగా 2025 వన్డే ప్రపంచకప్‌కు దూరమైన యాస్తిక భాటియా, పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చింది. గత ఏడాది ఇంగ్లండ్ సిరీస్‌లో రాణించిన రాధా యాదవ్ కూడా స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది. ఇక, డబ్ల్యూపీఎల్ 2026లో హ్యాట్రిక్ సాధించి సంచలనం సృష్టించిన నందిని శర్మ, జట్టు పేస్ బౌలింగ్‌ను బలోపేతం చేయనుంది. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు అమన్‌జోత్ కౌర్ (వెన్నునొప్పి), కశ్వీ గౌతమ్ (మోకాలి గాయం) దూరం కావడంతో నందినికి ఈ అవకాశం లభించింది. తెలుగమ్మాయిలు శ్రీ చరణి, అరుంధతిరెడ్డి కూడా వరల్డ్ కప్ జట్టుకు ఎంపికయ్యారు.జూన్ 12 నుంచి జులై 5 వరకు జరగనున్న ఈ వరల్డ్ కప్ టోర్నీలో భారత్ గ్రూప్ 1లో ఉంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. జూన్ 14న పాకిస్థాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2020లో రన్నరప్‌గా నిలిచిన భారత్, ఈసారి ఎలాగైనా కప్ గెలవాలనే పట్టుదలతో ఉంది. ఈ ప్రపంచకప్ కంటే ముందు, మే 28 నుంచి జూన్ 2 వరకు ఇంగ్లండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌లో కూడా ఇదే జట్టు ఆడనుంది.భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), నందిని శర్మ, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్.

# ఆమెలో నాకు ధోనీ కనిపిస్తున్నాడు: దినేష్ కార్తీక్

- స్మృతి మంధన కెప్టెన్సీని ధోనీ సారథ్యంతో పోల్చిన దినేష్ కార్తీక్
- ఆటగాళ్లకు స్వేచ్ఛనిస్తూనే, స్పష్టమైన నాయకత్వం అందిస్తుందని ప్రశంస
- మంధన సారథ్యంలో ఆర్సీబీ రెండోసారి డబ్ల్యూపీఎల్ టైటిల్ కైవసం
- టోర్నీలో అత్యధిక పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన స్మృతి
- గతేడాది ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు ఆమె వైస్ కెప్టెన్




భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మహిళల జట్టు కెప్టెన్ స్మృతి మంధనపై మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆమె నాయకత్వ పటిమ, ప్రశాంతతను చూస్తుంటే తనకు టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గుర్తుకొస్తున్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఆర్సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో కార్తీక్ మాట్లాడుతూ.. మంధన తనకు ఇష్టమైన క్రీడాకారిణులలో ఒకరని తెలిపారు. ఆమె తనను తాను ప్రెజెంట్ చేసుకునే విధానం, నిర్ణయాల్లో స్పష్టత అద్భుతంగా ఉంటాయన్నాడు. “ఆట పరిస్థితులను అంచనా వేయడంలో ఆమెకు సహజంగానే మంచి పట్టుంది. జట్టు సభ్యులకు పూర్తి స్వేచ్ఛనిస్తుంది. అదే సమయంలో, ఎవరికైనా సందేహం వస్తే అండగా నిలుస్తుంది” అని కార్తీక్ వివరించాడు. సరిగ్గా ఇలాంటి లక్షణాలే గతంలో ధోనీలో చూశామని, అందుకే ఆమె తన నాయకత్వ పరంగా ధోనీని గుర్తుచేస్తుందని పేర్కొన్నాడు.స్మృతి మంధన కెప్టెన్సీలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళల జట్టు డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధన నిలిచింది. ఫైనల్‌లో డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఆర్సీబీకి విజయాన్ని అందించడంలో ఆమె కీలక పాత్ర పోషించింది.అంతేకాకుండా, గతేడాది ఐసీసీ మహిళల ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు స్మృతి వైస్-కెప్టెన్‌గా వ్యవహరించింది. ఆ టోర్నమెంట్‌లో 434 పరుగులు చేసి జట్టు తొలిసారి ప్రపంచకప్ గెలవడంలో ముఖ్య భూమిక పోషించింది.

# వికెట్ తీసి వైభవ్ మీదకు దూసుకెళ్లిన కైల్ జమీసన్...ఢిల్లీ పేసర్ కు బిగ్ షాక్...




రాజస్థాన్ రాయల్స్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య శుక్రవారం ( మే 1 ) హోరాహోరీ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. మూడు వరుస ఓటముల తర్వాత ఈ మ్యాచ్ లో గెలుపొంది విజయపథంలోకి అడుగుపెట్టింది ఢిల్లీ. రాజస్థాన్ రాయల్స్ పై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది ఢిల్లీ.ఇదిలా ఉండగా...ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైల్ జమీసన్ ఈ మ్యాచ్ లో చేసిన ఓవర్ యాక్షన్ కు భారీ షాక్ ఇచ్చింది బీసీసీఐ. వైభవ్ సూర్యవంశీపై దూకుడు ప్రదర్శించి విమర్శలపాలయ్యాడు జమీసన్. జమీసన్ కు డీమెరిట్ పాయింట్ తో పాటు బిగ్ వార్నింగ్ ఇచ్చింది ఐపీఎల్ యాజమాన్యం. జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే చోటుచేసుకుంది ఈ ఘటన. వైభవ్ సూర్యవంశీని అవుట్ చేసిన ఆనందంలో సంయమనం కోల్పోయిన జమీసన్...వైభవ్ దగ్గరికి వెళ్లి అగ్రెసివ్ గా ప్రవర్తించాడు. ఒక టీనేజ్ ప్లేయర్ పై ఆ రేంజ్ లో స్లెడ్జింగ్ చేయడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అంతే కుకుండా ఈ వ్యవహారం బీసీసీఐ దగ్గరికి కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. జమీసన్ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న ఐపీఎల్ యాజమాన్యం... జమీసన్ ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినట్లు తేల్చింది. ఈ క్రమంలో మ్యాచ్ రిఫరీ విధించిన శిక్షను జమీసన్ అంగీకరించడంతో అతనికి ఒక డీమెరిట్ పాయింట్ తో పాటు బిగ్ వార్నింగ్ ఇచ్చింది ఐపీఎల్ యాజమాన్యం.లెవల్ 1 నిబంధనల ఉల్లంఘన కింద జమీసన్ పై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది ఐపీఎల్ యాజమాన్యం.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776